క్లుప్తంగా

గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట



అంబాసిడర్లను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కోటనందూరు: గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్ల వైద్య శిబిరాన్ని ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను ఆరోగ్యంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడార్లు సైతం ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతోనే ప్రభుత్వం వైద్య శిబిరం నిర్వహిస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు చేసిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని ఆధ్వర్యంలో గ్రీన్‌అంబాసిడర్లకు నిర్వహించిన వైద్య పరీక్షలను ఎంపీపీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, శివాలయం చైర్మన్ నారాయణరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరావు

కిర్లంపూడి: విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బడే రాజేశ్వరావు అన్నారు. మండలంలోని పలు సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రామకృష్ణపురం సచివాలయంలో హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. సకాలంలో విధులకు రాని పలువురు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఎవరు అలసత్వం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని బడే రాజేశ్వరావు హెచ్చరించారు. అనంతరం గ్రామంలో పలువురు రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నూకరాజు పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఉత్తమ ప్రతిభ



చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం సింహాచలం

రౌతులపూడి: ఇటీవల జిల్లా కేంద్రం కాకినాడలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రౌతులపూడికి ప్రాథమిక పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు ప్రథమస్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.సింహాచలం తెలిపారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన రామోజు దేవిర త్నం, కొప్పుల భవాని, మువ్వల దుర్గాభవాని పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచారని అన్నారు. విద్యార్థులు ముగ్గురికి ఐఈఆర్‌పీలు శ్రీనివాసు, అప్పారావు సమక్షంలో ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

సొసైటీలో రికార్డుల పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

కిర్లంపూడి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో జరిగిన పలు అవకతవకలపై ఆడిట్ బృందం రికార్డుల తనిఖీలను వేగవంతం చేసింది. డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి కె.పద్మ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా కిర్లంపూడి సొసైటీలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రారు ఆడిటర్ జె.శివ కామేశ్వరరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ డి.రాజేశ్వరీ, జి.చంద్రశేఖర్ సొసైటీలో రికార్డులను పరిశీలించారు.

రిలే దీక్షకు జనసేన మద్దతు

ప్రత్తిపాడు: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ నాయకత్వంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ సందర్శించి, మద్దతు తెలిపారు. తొలుత స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి దీక్షా శిబిరానికి ర్యాలీగా తరలివచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

కూర కుదిరింది

- దిగొచ్చిన ధరలు
- అందుబాటులో తాజా కూరగాయలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తుని: మొన్న నిన్నటి వరకూ కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. వారానికి సరిపడే కూరగాయలకు రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి వచ్చేది. ఇందుకు ప్రధాన కారణం స్థానికంగా పంట దిగుబడులు లేక పోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు తగ్గడంతో కూరల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం ధరలు దిగొచ్చాయి. మార్కెట్‌లో కూరగాయల ధరలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులకు అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులో లభించడంతో పాటు ధరలు గణనీయంగా తగ్గాయి. తక్కువ ధరల వలన ఎక్కువ రకాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుంటే రైతుల మాత్రం గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు.

ఇదీ సంగతీ

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు మండలాల్లో బోరుబావులు ఉన్న భూముల్లో 265 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూర పంటలను సాగు చేస్తున్నారు. జూన్, జూలైలలో ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో పంట దిగుబడి తగ్గింది. బోరు సదుపాయం ఉన్న చోట నీటి తడి పుష్కలం లభించడంతో అక్కడ దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. దీంతో రెండు నెలల పాటు రైతులకు దండిగా ఆదాయం సమకూరింది. తర్వాత వర్షాలు కురవడంతో అన్ని చోట్ల నుంచి ఒకే సారి దిగుబడులు రావడం అందరు మార్కెట్‌కు తరలించడం, విజయవాడ, రాజమహేంద్రవరం, లంక భూముల నుంచి ఎక్కువ ఉత్పత్తి అయ్యాయి. దీంతో పాటు విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి కూరగాయలు ఆకు కూరలు మార్కెట్‌కు ముంచెత్తాయి. దీంతో ధరలు గణనీయంగా పడిపోయాయి. కిలో టమాటా రూ.200, అల్లం రూ.200, వంకాయలు రూ.80, పచ్చిమిర్చి రూ.150 ఇలా అన్ని రకాల ధరలు మండిపోయేవి. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా టమాటా రూ.20, అల్లం రూ.80, వంకాయలు రూ.20లుగా ఉన్నాయి. ఇవే రీతిలో మిగిలిన రకాల ధరలు తగ్గాయి. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు మాత్రం కోత కూలి డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లో కూరగాయల ధరలు

రకం	పాత ధర	కొత్త ధర	వ్యత్యాసం
ఉల్లిపాయలు	45	25	20
వంకాయలు	80	20	60
బెండకాయలు	60	10	50
బీరకాయలు	60	30	30
క్యారెట్	60	40	20
టమాట	200	20	180
ఆనపకాయ	20	10	10
దొండకాయ	40	20	20
అల్లం	150	100	50



తుని రైతు బజారులో కూరగాయల దుకాణం

కూరగాయల ధర తగ్గడంతో..

ప్రస్తుతం కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్ యార్డులోని రైతు బజారుకు వెళితే అన్ని రకాల కూరగాయలు తక్కువ ధరకు దొరుకుతున్నాయి. నెల క్రితం వారానికి సరిపడే కూరలకు రూ.900 అయ్యేవి. ఇప్పుడు రూ.400లకే లభిస్తున్నాయి. వంటింటి బడ్జెట్‌కు ఉపశమనం లభించింది.

–కె.వరలక్ష్మి, గృహిణి,తుని

గిట్టుబాటు కాక..

కూరగాయల సాగుకు పెట్టుబడి ఎక్కువైంది. ప్రస్తుతం పండిన కూరలను మార్కెట్‌కు తీసుకువెళితే గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు పెరగడంతో స్థానికంగా ధరలు తగ్గిపోయాయి. అర ఎకరంలో పలు రకాల కూరలు, ఆకుకూరల పంటను సాగు చేశాను. విత్తనాలు, ఎరువులు, కలుపుతీతకు రూ.15 వేలు పెట్టుబడి అయ్యింది. వారం రోజులుగా మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మితే రూ.6 వేలు వచ్చాయి.

–వెంకట రమణ, రైతు

భారత్ వికాస్ పరిషత్ సేవలు అభినందనీయం



తిప్పేస్వామిని సత్కరిస్తున్న బీవీపీ ప్రతినిధులు

తుని: స్థానిక భారత వికాస్ పరిషత్(బీవీపీ) సేవలు అభినందనీయమని ఆ సంస్థ సౌత్ రీజనల్ సెక్రటరీ తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం బీవీపీ స్థానిక కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిప్పేస్వామి మాట్లాడుతూ సమాజ హితం కోసం మరిన్ని సేవలకు నాంది పలకాలన్నారు. సంస్థ ద్వారా చేస్తున్న సేవ, సంస్కార్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తుని పట్టణం, రూరల్ ప్రాంతాల్లో చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీవీపీ తుని శాఖ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీవీపీ స్టేట్ రీజనల్ సెక్రటరీ ఎంవీవీ సత్యన్నారాయణ, విశాఖ ప్రాంత అధ్యక్షులు వీ సన్యాసిరాజు, సౌత్ రీజియన్ సేవ ఎంవీఎస్ఎన్ రాజు, బీవీపీ తుని గౌరవ అధ్యక్షులు ఎంవీ సూర్యనారాయణరాజు, అధ్యక్షులు పీఎల్ ఆచార్యులు, సభ్యులు చదరం శివాజీ, ఆంజనేయప్రసాద్, వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ క్రీడా పోటీలు

తుని: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారని ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. శుక్రవారం రాజా కళాశాల మైదానంలో జరిగిన పోటీలకు తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–17 బాలుర విభాగం ఖోఖో, కబడ్డీలో తుని జట్టు విన్నర్స్, తొండంగి రన్నర్స్, వాలీబాల్‌లో తొండంగి విన్నర్స్, తుని రన్నర్స్, అండర్–14 బాలుర విభాగంలో ఖోఖోలో తుని విన్నర్స్, కోటనందూరు రన్నర్స్, కబడ్డీలో కోటనందూరు విన్నర్స్, రన్నర్స్ తుని, వాలీబాల్‌లో తుని విన్నర్స్, తొండంగి రన్నర్స్‌గా నిలిచాయి. అండర్–17 బాలికల విభాగంలో ఖోఖోలో తుని విన్నర్స్, తొండంగి రన్నర్స్, కబడ్డీలో కోటనందూరు విన్నర్స్, తొండంగి రన్నర్స్, అండర్–14 బాలికల విభాగంలో ఖోఖోలో తుని విన్నర్స్, తొండంగి రన్నర్స్ కబడ్డీలో కోటనందూరు విన్నర్స్, తుని రన్నర్స్‌గా నిలిచాయన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనా జట్లను ఎంఈవో గీతాదేవి అభినందించారు. తుని నియోజకవర్గ సమన్వయకర్త పి.ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణలో కోటనందూరు మండల కో ఆర్డినేటర్ జాన్ విక్టర్, తొండంగి కో ఆర్డనేటర్ నరసింహామూర్తి, బి.గోపాలరావులు పోటీలు నిర్వహించారు. పీఈటీలు కె.రమేష్, శ్రీనివాస్,లోవలక్ష్మి, భవానీ, రమేష్ రాజ్, రామన్నదొర, కల్యాణి, మూడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.



తునిలో జరిగిన కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



కత్తిపూడిలో ఆటల పోటీలను ప్రారంభించిన ఎంపీపీ పర్వత రాజుబాబు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజు, పీఈటీలు

క్రీడలతో మానసికోల్లాసం

శంఖవరం: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. కత్తిపూడి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, త్రోబాల్, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు సత్తిబాబు,ఉప సర్పంచ్ గౌతు నాగు, ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు అర్జుబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక

తుని రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తుని నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారని తుని మండలం లోవకొత్తూరులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజు శుక్రవారం తెలిపారు. ఈనెల 21న తునిలో నియోజకవర్గస్థాయి పోటీలు జరిగాయన్నారు. సీనియర్ వాలీబాల్ విభాగంలో ముగ్గురు, జూనియర్ వాలీబాల్ విభాగంలో ముగ్గురు, కబడ్డీలో ఒకరు, బ్యాడ్మింటన్‌లో ఐదుగురు, యోగాలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో నలుగురు ప్రతిభ కనబర్చారన్నారు. దీంతో 18 మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లాలోను నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారన్నారు. జిల్లాకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజు, పీఈటీలు పెదపూడి మరిణియ్య, ఏలేటి రాము, ఉపాధ్యాయులు అభినందించారు.

వనదుర్గమ్మకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం హోమం ప్రారంభించారు. తర్వాత హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి ఘనంగా చేశారు. నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు సమర్పించారు. రూ.750 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి 40 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. అలాగే సత్యదేవుని ఆలయంలో సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కనకదుర్గ అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలు వేదపండితులు హనుమంతువజ్ఝల అవధాని, వనదుర్గ ఆలయ అర్చకులు వంశీ, దత్తాత్రేయ శర్మ, ఫణి, బాలు, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి తదితరులు చేశారు.



హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం



పోతులూరులో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



జగపతినగరంలో సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని చేపట్టిందని శాంతిఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. పోతులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, రామకృష్ణ, ఎల్‌హెచ్ పి.పవన్, ఏఎన్ఎం కమలమ్మ, ఏఎంసీ డైరెక్టర్ నాగులాపల్లి బాబ్జి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జగపతినగరం–2లో శుక్రవారం ఆరోగ్య వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీనివాసారావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆవ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: మండలంలోని ఇటికాయలపల్లి, కామరాజుపేట, కొత్తపల్లి, రంపయర్రంపాలెం, తంటికొండ, గోకవరం, వీరలంకపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని కొత్తపల్లి, గోకవరం ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు తిరన్, అలేఖ్య, నిఖిత, ఎంపీహెచ్ఈఓలు శంకర్, మూర్తిలు పరిశీలించి పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలకు వచ్చి ప్రజలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలను శుక్రవారం ఆర్జేడీ చప్పిడి కృష్ణ తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను, పరిసరా ప్రాంతాలను, అధ్యాపకుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించారు. కళాశాలకు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులు ప్రతిభ కనబరచాలన్నారు. చదువుపై ఏకాగ్రత కలిగి ఉత్తీర్ణత శాతం పెరిగేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం ఆయన కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులను గురించి తెలుసుకున్నారు. అనంతరం దాతలు బహూకరించిన ఎల్‌సీడీ స్క్రీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడు,ఎకడమిక్ కో.ఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ కృష్ణ

బీసీవైపీ రాష్ట్ర సమన్వయ సారథిగా అనూష యాదవ్

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవర అనూష యాదవ్‌ను భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) రాష్ట్ర సమన్వయ సారథజగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ విధి, విధానాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా తనకు రాష్ట్ర స్థాయిలో బీసీవైపీలో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత బోడే రామచంద్రయ్య యాదవ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: ఎస్.పైడిపాల గ్రామ శివారులో మోటారుసైకిల్‌పై అక్రమంగా సారాను తరలిస్తున్న రౌతులపూడికి చెందిన బి.అభిమన్యుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబి శుక్రవారం తెలిపారు. అతని నుంచి పది లీటర్ల సారా, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

రౌతులపూడి: ములగపూడి వాసవీసుధ ఆగ్రోఫుడ్స్(జీడిపిక్కల ఫ్యాక్టరీ) ఆవరణలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కె.సత్యనారాయణ తెలిపారు. వాసవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.కుమార్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్టు తెలిపారు.


వసతి గృహాన్ని సందర్శించిన జెడ్పీటీసీ

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ స్థాయీ సంఘం డైరెక్టర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలోని వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, పంచాయతీ వార్డు సభ్యుడు తాతపూడి బుజ్జి, వసతిగృహ సంక్షేమాధికారిణి జె సాయి సూర్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రాజరాజేశ్వరి

65 కిలోల గంజాయి స్వాధీనం



ఆటోల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

జగ్గంపేట: పదహారువ జాతీయ రహదారిపై రెండు ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 65 కిలోల గంజాయిని జగ్గంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజుకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రామవరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎస్సై, తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు ఆటోల్లో ప్యాకెట్లలో తరలిస్తున్న 65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి, రెండు ఆటోలను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

ఫార్మాలో ఏఐది కీలక పాత్ర

గండేపల్లి: ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పాత్ర కీలకమైనదని ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యాన శుక్రవారం ప్రారంభమైన జాతీయ స్థాయి సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియం కారె మాట్లాడుతూ, ఆధునిక డిజిటల్ యుగంలో ఫార్మసిస్ట్ పాత్రను వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. మొదటి రోజు 30 కళాశాలల విద్యార్థులు 300 శాస్త్రీయ ప్రదర్శనలు నిర్వహించారన్నారు. డిజిటల్ యుగంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ, ఫార్మా రంగంలో కొత్త మార్పులు, ఉపాధి అవకాశాలను వివరించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ఆకట్టుకున్న ప్రదర్శనలు

పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా

కొత్తపల్లి: గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటి పథకం ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్ అన్నారు. వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి ఏరియా పరిసర గ్రామాల తాగునీటి పథకాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ ఈసీఓ రమణారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ చెరువు, ఫిల్టర్ బెడ్‌లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.సంధ్య ఉన్నారు.

లక్ష్మీగణపతి అలంకరణలో వినాయకుడు



లక్ష్మీగణపతిగా పూజలందుకున్న గణేశుడు



ఏలేశ్వరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర ఉత్సవాలులో భాగంగా ఐదో రోజు శుక్రవారం వినాయకుడిని లక్ష్మీ గణపతిగా అలంకరించి, పూజలు చేశారు. తెల్లని వస్త్రాలు ధరించిన గణపతి ఎడమవైపు లక్ష్మీదేవితో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వర శర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు,వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు శర్మ, సుధీర్, పవన్, నగేష్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గణపతికి ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం మహిళలు గణపతికి పూజలు చేశారు. స్థానిక మార్కెట్‌వీధిలో నెలకొల్పిన వినాయక ఆలయంలో పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పారాయణ, పూజలు జరిగాయి. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, గొల్లపూడి సత్యనారాయణ, సంఘ మహిళాసభ్యులు పాబోలు దేవి, కామాక్షి, లక్ష్మీకుమారి, మల్లేశ్వరీ, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మరచిన ట్రాలీ బ్యాగ్ యజమానికి అందజేత

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాంపై ఓ ప్రయాణికుడు మరచిపోయిన ట్రాలీ బ్యాగ్‌ను అతని భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు బాధితులకు అందజేశారు. ఈనెల 20న కాకినాడకు చెందిన ఉగ్గిన మనోహర్ సామర్లకోట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్లారు. రైలు ఎక్కే హడావిడిలో ప్లాట్‌ఫాంపై ట్రాలీ బ్యాగ్ మరచి పోయారు. రైలు ఎక్కిన తరువాత బాధితుడు తన భార్య అంజలికి సమాచారం ఇచ్చారు. దాంతో ఆమె సామర్లకోట జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ట్రాలీ బ్యాగ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రైల్వే ఎస్సై బి.లోవరాజ సిబ్బంది సహకారంతో బ్యాగ్ వెతికించి భద్రపరచి శుక్రవారం ఆమెకు అందజేశారు. జీఆర్పీ సిబ్బంది పని తీరుపై రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ హర్షం వ్యక్తం చేశారు.